క్లుప్తంగా

ఆర్టీసీని ఆదరించాలి



లక్కీడ్రా తీస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ప్రయాణికులు ఆర్టీసీ సంస్థను ఆదరించాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక బస్టాండు ఆవరణంలో తంబళ్లపల్లె మార్గంలో లక్కీడిప్‌ను తీశారు. ప్రయాణికుల కోసం ఆర్టీసీ అన్ని మార్గాల్లో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. లక్కీడిప్‌లో చిన్నమధు, బి.సాంబశివ, విజయ్ విజేతలుగా నిలిచారు. వీరు డిపోకు వచ్చి బహుమతులు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే భవిష్యత్



పాఠ్యాంశాలపై ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

గుర్రంకొండ: కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని డీఈఓ శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్, ఏపీ గురుకుల పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, హైస్కూల్ రికార్డులు, మధ్యాహ్నభోజన రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు అందించిన పాఠ్యపుస్తకాలనూ, ఉపాధ్యాయుల పనితీరును, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలను కల్పించడంలో ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ప్రతిరోజు మధ్యాహ్న భోజనంను ఉపాధ్యాయులు తనిఖీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సురేంద్రబాబు, సుబ్రమణ్యం, ప్రిన్సిపాల్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టిగణపతే.. మహా గణపతి

కలకడ : మట్టిగణపతే.. మహా గణపతి అని కలకడ సర్పంచ్ ప్యారీజాన్ అన్నారు. మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని ప్యారీజాన్, యూటీపీఆర్‌డీ లతీప్ ఖాన్, దేవేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలకడ బస్టాండ్ మూడురోడ్ల కూడలి వద్ద జిల్లా కలెక్టర్ ప్రకటన మేరకు బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన విగ్రహాలను చెరువులు, కుంటల్లో వేయడంతో అవి కరిగేందుకు నెలల తరబడి సమయం పట్టడమే కాక నీరంతా కలిషితమవుతుందన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలకడ పంచాయతీ బిల్‌కలెక్టర్ ఓబులేసు, హరినాథ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి



సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేస్తున్న మాధవ్

కలికిరి: జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌ను ర్యాగింగ్ చేసి అతని మృతికి కారణమైన నిందితులపై కేసు కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవ్ శుక్రవారం కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వర రావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని తెలిసి కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం విచారకరమన్నారు. ప్రవీణ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు.

పెన్షన్లు పంపిణీ చేయండి

ములకలచెరువు: నిష్పక్షపాతంగా పెన్షన్లు పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ పోలప్ప ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆదివారం సెలవుకావడంతో శనివారం పూర్తి స్థాయిలో పింఛన్లు పంపిణీ చేయాలని సూచించారు. ఫిర్యాదులు అందకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను హెచ్చరించారు.

శుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

పెద్దతిప్పసముద్రం: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఎండీ యస్దానీ తెలిపారు. స్థానిక మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఎండీ యస్దానీ సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. హాస్టళ్లను పరిశీలించి పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పాముల కాలం.. జర భద్రం

- సర్పాలు, కీటకాల సంచారం
- వర్షాకాలంలో అప్రమత్తత అవసరం
- నాటు వైద్యాన్ని నమ్ముకోవద్దు
- జాగ్రత్తలు పాటిస్తే పాము కాటుకు దూరం



మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెకు చెందిన రమణ పొలం పనులు చేస్తుండగా ఈ నెల 12న పాము కాటు వేసింది. పొలం వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన రైతులు తంబళ్లపల్లెకి సీహెచ్‌సీకి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి రావడంతో ప్రాణాలతో బతికాడు.

మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ జమ్మికుంటపల్లికి చెందిన రాజశేఖర్ భార్య కవిత (33) పొలం వద్ద పనులు చేస్తుంతుండగా ఈ నెల 25న పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ప్రకటించారు.

ఇలాంటి ఘటనలు మదనపల్లె డివిజన్ పరిధిలో నిత్యం చోటు చేసుకుంటున్నాయి. అమ్మో.. పాము అంటూ ప్రజలు బయపడే రోజులొచ్చాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పుట్టల్లోకి నీరు చేరవడంతో పాములు బయట సంచరిస్తున్నాయి. పొలం గట్ల వెంట, పొలాల సమీపంలోని ఇళ్ల, గుడిసెలు, ముళ్ల పొదలు, గడ్డివాములు తదితరాలను అవాసంగా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో రోజు ఏదో ఒక ప్రాంతంలో పాము కాటు బాధితులు వెలుగులోకి వస్తున్నారు.

అన్నీ విషసర్పాలు కావు

కాటేసిన పాములన్నీ విషసర్పాలు కాపోయినా.. మనిషి ప్రాణాలు హరించే వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏ పాము కరిచినా వెంటనే వైద్యం చేయించాలి. అయితే చాలా మంది నాటు వైద్యం వైపు మొగ్గు చూపడంతో పరిస్థితి విషమించి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. న్యూరో టాక్సిన్ రకానికి చెందిన నాగుపాము, కట్లపాము కాటు వేస్తే నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉందని అంటున్నారు. గుండెతో పాటు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందంటున్నారు. ఏ పాము కరిచిందో స్పష్టంగా చెబితే సరైన చికిత్సతో రోగి ప్రాణాలు కాపడడం సులవుతుందని వైద్యులు చెబుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

ఇంటి పరిసరాల్లో పాములు చేరకుండా ఉండేందుకు చెత్తకుప్పలు, ముళ్ల పొదలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి గోడ పక్కన కట్టెలు, ఏ వస్తువులూ ఉంచరాదు. వాటి సాయంతో పాములు ఇళ్లల్లోకి ప్రవేశించే ప్రమాదముంది. ఇంటి బయట రాత్రి సమయంలో వెలుతురు ఉండేలా చూడాలి. చీకట్లో బయటకు వెళ్లాల్సి వస్తే బూట్లు, లేదా చెప్పులు ధరించాలి. రైతులు, రైతు కూలీలు పంట పొలాల్లో పనులకు వెళ్లేటప్పుడు గజ్జెల కట్టిన చేతి కర్రతో శబ్దం చేస్తూ పాముల బారినపడకుండా ఉండవచ్చు.

అందుబాటులో మందులు



పాముకాటుకు గురైన వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లాలి. అన్ని పీహెచ్‌సీల్లో వీనమ్ ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నాయి. నాటు వైద్యం, మంత్రాలు, తంత్రాలు అంటూ ఆలస్యం చేస్తే బాధితుడి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.

–డాక్టర్ వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

• విరబూసిన బ్రహ్మ కమలం



పుష్పాలన్నింటిలోకీ బ్రహ్మకమలాలు ప్రత్యేకంగా కనిపించి, మనసులను మురిపిస్తాయి. చలి ప్రదేశాల్లో ఏడాదికి ఒకసారి మాత్రమే విరబూసే బ్రహ్మ కమలాలు కురబలకోట ఎంపీపీ బి. దస్తగిరి ఇంట విరబూశాయి. ఏడాదిలో ఒక రాత్రి మాత్రమే వికసించి వాడిపోతాయి. ఈ పుష్పాలను శుభప్రదంగా భావిస్తారు. బ్రహ్మకమలం అనేది భూమి పైననే పుష్పించే ఒక ఔషధీయ పుష్పం. బ్రహ్మ కమలం అంటే బ్రహ్మ ఆసీనులయ్యే పుష్పం.

– కురబలకోట

వాహన అద్దెలు చెల్లించండి మహాప్రభో..!



ఎంవీఐ దినేష్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న నవయువ కార్‌డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికల్లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల విధుల కోసం వాడుకున్న ప్రైవేట్ టాక్సీ వాహనాలకు అద్దెలు చెల్లించి తమను ఆదుకోవాలని నవయువ కార్ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు వేడుకున్నారు. శుక్రవారం మదనపల్లె ఎంవీఐ దినేష్‌చంద్రను కలిసి వాహన అద్దెల బకాయిలు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవయువ కార్‌డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్‌సాహెబ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు దాదాపు 90 వాహనాలకు పైగా ప్రైవేట్ టాక్సీ వాహనాలను అధికారులు వినియోగించుకున్నారని తెలిపారు. ఎంవీఐ అధికారులు ఆదేశించిన తర్వాతనే వాహనాలు పంపామని, అద్దెలకు సంబంధించి మదనపల్లె, తంబళ్లపల్లె ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మూడుసార్లు అర్జీలు సమర్పించామని పేర్కొన్నారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి సుమారు రూ.36లక్షల వరకు బకాయిలు రావాలని, వెంటనే చెల్లించాలని కోరారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ: ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. యూటీఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ పాత పెన్షన్ కావాలని గత 20 సంవత్సరాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటం చేసిన ఫలితంగా కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. యూపీఎస్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షురాలు హేమలత, జిల్లా కార్యదర్శులు పురం రమణ, ఆదినారాయణ, రవిప్రకాష్, సుధాకర్, శ్రీనివాసులు, హరికృష్ణ పాల్గొన్నారు.

రేపు శాసనసభ్యులకు వినతిపత్రాలు

కేవీపల్లె : సీపీఎస్ విధానం రద్దుకు డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా శాసనసభ్యులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ ఒకటో తేదీన బ్లాక్‌డేగా నిర్వహిస్తూ నిరసన కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఈ సారి శాసనసభ్యులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏడాది లోపు సీపీఎస్ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

బలవంతపు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

మదనపల్లె : వినాయకచవితి పండుగను పురస్కరించుకుని ప్రజల నుంచి బలవంతపు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ డి.కొండయ్యానాయుడు హెచ్చరించారు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వినాయకచవితి మంటపాల ఏర్పాటుకు ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వినాయకచవితి ఉత్సవాలు నిర్వహణలో పూర్తిబాధ్యత కమిటీ సభ్యులదేనని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన తేదీలను ముందుగానే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో తెలియజేసి తగిన బందోబస్తు పొందాలన్నారు. వినాయకచవితి పేరు చెప్పి ఎక్కడైనా బలవంతపు వసూళ్లకు పాల్పడుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం



అక్కదేవతలను ఊరేగిస్తున్న భక్తులు

వాల్మీకిపురం: స్థానిక పట్టాభిరామాలయంలో శుక్రవారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల ఉత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని అమిలేపల్లె పంచాయతీ ఎగువ అమిలేపల్లెలో వెలిసిన అక్కదేవతల ఆలయంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను భక్తులు గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జీవన్ కుమార్, అర్చకులు రాజుస్వామి పాల్గొన్నారు.

భూ రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె: మండలంలో ఫ్రీహోల్డ్ భూ రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయలంలో వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లతో సమావేశం జరిగింది. ఫ్రీహోల్డ్ భూములను గుర్తించడం, రీ సర్వే చేసే తీరును వివరించారు. ఇంటింటా సర్వేను నిర్వహించి ఓటర్ల జాబితాలో తప్పులు, ఒప్పులు సవరించడం, డబుల్ ఎంట్రీలను సవరించడం, మృతి చెందినవారి పేర్లు తొలగించాలని వీఆర్‌ఓలకు సూచించారు. సమావేశంలో మండల సర్వేయర్ గిరిఆచారి, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

పశు బీమా సద్వినియోగం చేసుకోండి

తంబళ్లపల్లె: పాడి పశువులు ఉన్న రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ సూచించారు.శుక్రవారం స్థానిక పశువుల ఆస్పత్రిలో పశువైద్యులు, ఏహెచ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి ఆవులు, జీవాలకు పాలసీ తీసుకుంటే ప్రమాదవశాత్తు మృతి చెందిన సమయాల్లో ఇన్సూరెన్సు కార్యాలయం నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీలు సుమిత్ర, విశ్వేశ్వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్లు సుజనశ్రీ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'చింతల' పర్యటనను జయప్రదం చేయండి

కలకడ : మండలంలోని కలకడ టౌన్ లో పర్యటించనున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటన విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సెప్టెంబర్ 2న కలకడలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కార్యక్రమంలో చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

కీటకజనిత వ్యాధులతో జాగ్రత్త

పీలేరు : కీటకజనిత వ్యాధులైన మలేరియా, డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కార్తీక్‌కుమార్ సూచించారు. శుక్రవారం రేగళ్లు పీహెచ్‌సీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి తొలగించాలన్నారు. సీహెచ్‌ఓ జయలక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి విద్యాసాగర్, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ చిన్నప్ప, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రలేఖ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు రూరల్: అన్నమయ్య జిల్లాలో పని చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డిపో కార్యాలయం ఎదుట ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు అరియర్స్, ఇంక్రిమెంట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రావాలసిన బకాయిలు సకాలలో చెల్లించాలని కోరారు. కార్మికులకు జీతాలు పారదర్శకంగా ఇవ్వాలన్నారు. 2022–23 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయూ నాయకులు సి.వి. రమణ, వి.పి. నాయుడు, ఆదినారాయణ, ఎం.హెచ్. నాయుడు, బి.ఆర్.కె. నాయక్, ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ప్రాణికి కంటిచూపు అవసరం

కురబలకోట: ప్రతి ప్రాణికి కంటిచూపు అవసరమని అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. విజయభాస్కర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లెలో అగర్వాల్ కంటి ఆస్పత్రి నిర్వాహకులు కళాశాలలో కంటి శిబిరం నిర్వహించారు.

బియ్యం వితరణ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు వారి సేవలను విస్తృతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ముల్‌బాగిల్ సమీపంలోని శని మహాత్మ ఆలయంలో జరుగుతున్న అన్నదానం కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్‌ను అందజేసి మానవత్వం చాటుకున్నారు.

పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత



మొక్కలు నాటి నీళ్లుపోస్తున్న ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె : పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని డీఎఫ్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. భావితరాల వారికి వాతావరణ సమతుల్యతతో కూడిన పర్యావరణాన్ని అందించేందుకు, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. వనమహోత్సవం కార్యక్రమాన్ని పట్టణంలోని నగరవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటిమొక్కలు నాటడమే ధ్యేయంగా వన మహోత్సవానికి రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. భూభాగంలో 33శాతం అటవీప్రాంతం ఉండాలని పర్యావరణ వేత్తలు చెబుతున్నారని, రాష్ట్రంలో 22.86 శాతం మేర అడవులు విస్తరించి ఉన్నాయని తెలిపారు. మదనపల్లె పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మదన్‌మోహన్, ప్రకాష్, బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

పీలేరు : మానవ మనుగడకు మొక్కలే ఆధారమని పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. వృక్షాలతో విరివిగా వర్షాలు కురవడంతో పాటు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని తెలిపారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. అలాగే ఎంపీడీఓ ఉపేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ ప్రసాద్‌బాబు, ఏపీఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

ములకలచెరువు: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా బురకాయలకోట గురుకుల పాఠశాలలో ఎంపీడీఓ మొక్కలు నాటారు. అనంతరం చెట్ల ప్రాముఖ్యతపై ఆయన విద్యార్థులకు వివరించారు.